'కలశ'కు ఆసియా ఐకాన్ అవార్డు

కొలంబో గవర్నర్ సెంథిల్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కలశ నాయుడు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 28 : బంజారాహిల్స్‌కు సామాజిక సేవకురాలు చెందిన డాక్టర్ కలశనాయుడుకు అరుదైన అవార్డు దక్కింది. దేశ, విదేశాల్లో పేదలకు విద్య, వైద్యం, ఆరోగ్య రంగాల్లో సేవలందిస్తూ అతి పిన్న వయస్సు సామాజిక సేవకురాలిగా అంతర్జాతీయంగా ఖ్యాతిగడించారు. ఈనెల 26, 27 తేదీల్లో శ్రీలంక ప్రభుత్వం సామాజిక సేవల విభాగంలో కలశ నాయుడును ఆసియా ఐకాన్‌కు ఎంపిక చేశారు. ఈ మేరకు కొలంబో గవర్నర్ చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు.

మహమ్మద్ సల్మాన్ అహ్మద్‌కు డాక్టరేట్

న్యూఢిల్లీలో సినీనటి శిల్పాశెట్టి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న మహమ్మద్ సల్మాన్ అహ్మద్

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 28 : ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం నిర్వహించిన సెమినార్‌లో శంషాబాద్ మండలం హమీదుల్లానగర్‌కు చెందిన మహమ్మద్ సల్మాన్ అహ్మద్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. శనివారం న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో బాలీవుడ్ నటి శిల్పాశెట్టి చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా సల్మాన్ అహ్మద్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి సెమినార్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లీగల్ స్టడీస్‌లో విభాగంలో తనకు డాక్టరేట్ వచ్చిందన్నారు.

అధికారులు మార్కింగ్ చేసిన కుటుంబాలు

ప్రభుత్వానికి సహకరించాలి

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక
- అక్రమ నిర్మాణాలే అయినా బాధితులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడి

రాజేంద్రనగర్ ఎమ్మార్వో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 28: మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలు స్వచ్ఛందంగా ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు వెళితే వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక వెల్లడించారు. శనివారం సాయంత్రం రాజేంద్రనగర్‌లోని ఎమ్మార్వో కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రంగారెడ్డి జిల్లాలో మూసీ నది ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘట్ వరకు 11.7 కిలోమీటర్లు, బాపూఘట్ నుంచి జియాగూడ కమేలా వరకు 4 కిలోమీటర్లు, హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘట్‌కు 9 కిలోమీటర్ల మేర ఉందన్నారు. గండిపేట, రాజేంద్రనగర్ మండలాల్లోని మూసీ పరీవాహక ప్రాంతాల్లో దాదాపు 339 అక్రమ నిర్మాణాలను గుర్తించామన్నారు. ఇది కేవలం రివర్ బెడ్ ప్రాంతంలో ఉన్న నిర్మాణాలని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది నిర్మాణాలు చేపట్టిన కుటుంబాలతో మాట్లాడుతున్నారని అన్నారు. స్వచ్ఛందంగా వెళ్లే వారికి నార్సింగి, జియాగూడ ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయిస్తున్నట్లు తెలిపారు. 339 నిర్మాణాల్లో సుమారు 175 నివాస గృహాలు తమ దృష్టిలో ఉన్నాయన్నారు. వీటిలో దాదాపు శనివారం సాయంత్రం వరకు 22 కుటుంబాల వారు తమకు కేటాయించిన ఇళ్లకు వెళ్లారని చెప్పారు. ఆదివారం మరి కొంత మంది వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇందులో భాగంగా ఇండ్ల అడ్మిషన్‌తో పాటు మహిళా సంఘాల్లో చేర్పించాలని, లోన్‌లు అందించాలని బాధితులు కోరుతున్నారని పేర్కొన్నారు. వారిని అన్ని విధాలుగా ఆదుకొని పునరావాసం కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఎవరు అపోహలను నమ్మి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ఎవరినీ భయపెట్టి ఇళ్ల నుంచి పంపించే ప్రయత్నం చేయడం లేదన్నారు. బాధిత ప్రజలు అధికారులు, సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రతీమాసింగ్, ఆర్డీవో వెంకట్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మార్వో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జూపల్లి జగపతిరావుతో ప్రాణహాని..

- బీఆర్ఎస్ నాయకుడు చిలకమర్రి నర్సింహ
- రక్షణ కల్పించాలని డీసీపీకి వినతి

రక్షణ కల్పించాలని డీసీపీ రాజేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న చిలకమర్రి నర్సింహ

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 28: మైహోం సంస్థ ఎండీ జూపల్లి జగపతిరావుతో తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని శనివారం బీఆర్ఎస్ నాయకుడు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహ శనివారం శంషాబాద్ డీసీపీ రాజేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 24న గ్రామస్తులతో మాట్లాడి టీ తాగి తిరిగి ఇంటికి వస్తుండగా జేమ్స్ దవాఖాన వద్ద తన కారుపై పలువురు కర్రలతో దాడికి పాల్పడ్డారని అన్నారు. జగపతిరావే తనపై దాడి చేయించాడని , ఆయనతో తనకు ప్రాణహాని ఉందని పేర్కొన్నారు. జేమ్స్ ఆసుపత్రి వద్ద సీసీ కెమెరాలను గంట ముందే ఆఫ్‌చేసి తనపై దాడి చేయించారని తెలిపారు. 2018 నుంచి తనపై ఆయన కక్ష కట్టారని, దాంతోనే తనపై దాడి చేయించారని ఆయన పేర్కొన్నారు. జగపతిరావు బారి నుంచి తనను కాపాడాలని డీసీపీకి విన్నవించారు.

పేదల జోలికి వస్తే ఊరుకోం..

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూల్చివేస్తుంది..

బండ్లగూడ శ్రీ సరస్వతీ విద్యాపీఠంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, లింగం సుధాకర్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 28: మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూల్చేందుకు కాంగ్రెస్ సిద్ధమైందని, ఇలాంటి దుశ్చర్యలను బీజేపీ చూస్తూ ఊరుకోదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హెచ్చరించారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ సరస్వతీ విద్యాపీఠం విదారణ్య విద్యాలయంలో గోకరి అర్జున్‌గౌడ్ తన తండ్రి జ్ఞాపకార్థం నూతనంగా నిర్మించిన భవనాన్ని కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యారణ్య మందిరం విజ్ఞానంతో పాటు విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందన్నారు. తల్లిదండ్రులను మమ్మీ డాడీ అని కాకుండా అమ్మా నాన్నా అని గౌరవంగా పిలవాలన్నారు. కార్యక్రమంలో లింగం సుధాకర్‌రెడ్డి, గోకరి అర్జున్‌గౌడ్, సరస్వతీ విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావు, సీతారాం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తల గోక్కొంటున్నది..

కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో తల గోక్కుంటున్నదని అన్నారు. ఏదో చేద్దామనుకుంటే మరేదో జరిగిందని.. ఇప్పుడు ప్రజలు పూర్తిగా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మారిపోయారన్నారు. పేదల జోలికొస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పనైపోయిందన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒవైసీ సోదరులు చెరువును ఆక్రమించి నిర్మించిన బిల్డింగ్‌లను ఎందుకు కూలగొట్టడం లేదన్నారు.

మూసీ సుందరీకరణ పెద్ద బోగస్ అని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ విధానాలతో ప్రజలు విసిగిపోయారని ముఖ్యంగా హైడ్రా దాడులు, మూసీ ప్రక్షాళన, పేదల ఇండ్ల కూల్చివేత, ఆరు గ్యారెంటీల అమలులో వైఫల్యం చెందారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల తరువాత గెలిచిన సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి చలో హైదరాబాద్ పేరుతో మార్చ్ నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

క్రీడల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

జూబ్లీహిల్స్/ఎర్రగడ్డ,సెప్టెంబర్ 28 : క్రీడల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ స్థాయి ఇంటర్ స్కూల్ గేమ్స్‌లో బంజారాహిల్స్ రోడ్ నంబర్-7లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కబడ్డీలో విజేతలుగా నిలిచారు. శనివారం ఎర్రగడ్డ డాన్‌బాస్కో స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో విజేతలకు క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీ విశ్వేశ్వర్‌రావుతో కలిసి డిప్యూటీ ఐఓఎస్‌లు కొర్స యాదగిరి, పి.పరమేశ్వరమ్మ, శ్రావణ్‌కుమార్ బహుమతులు అందజేశారు. సీనియర్ ఉపాధ్యాయులు నరసింహ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా అవార్డులకు దరఖాస్తులు

ముషీరాబాద్, సెప్టెంబర్ 28: అఖిలభారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య 24వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభావంతులకు అవార్డులను అందజేయనున్నామని, ఇందుకోసం అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు సంస్థ జాతీయ కార్యదర్శి డాక్టర్ గణగళ్ల విజయ్ కుమార్ తెలిపారు. వచ్చే నెల 2లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రాజ్‌భవన్ పాఠశాలకు జోస్ అలుక్కాస్ చేయూత

పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణశ్రీకి రూ. 1.43 లక్షల చెక్కు అందజేస్తున్న జోస్ అలుక్కాస్ సంస్థ మేనేజర్ షానోజ్ ఫిలిప్

ఖైరతాబాద్, సెప్టెంబర్ 28 : రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రముఖ జువెల్లరీ సంస్థ జోస్ అలుక్కాస్ చేయూత అందించింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీగా మ్యూజిక్ సిస్టమ్,క్రీడా సామగ్రి కోసం సంస్థ మేనేజర్ షానోజ్ ఫిలిప్ రూ. 1,43,445ల చెక్కును శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణశ్రీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుకునే పాఠశాలలకు తమ వంతు సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపాల్, సురేందర్, లత, సునీత తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ఖోఖోలో గెలుపొందిన రాజ్‌భవన్ పాఠశాల విద్యార్థులు

హైదరాబాద్ జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో రాజ్‌భవన్ హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. ఖైరతాబాద్ జోన్‌లోని డాన్‌బాస్కో స్కూల్‌లో జరిగిన క్రీడా పోటీల్లో ఖోఖో అండర్-14 బాలుర విభాగంలో మొదటి, అండర్-17లో ద్వితీయ బహుమతులు, బాలికల అండర్-14, 17 విభాగాల్లో రెండో బహుమతి గెల్చుకున్నారు. అదేవిధంగా నాంపల్లిలోని శంకర్ జీ మెమెరియల్ పాఠశాలలో జరిగిన ఆర్చరీ పోటీల్లో రాజ్‌భవన్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి వైభవ్ జిల్లా స్థాయిలో మొదటి బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కరుణశ్రీ అభినందించారు. చదువు, క్రీడల్లో మరింత మెరుగ్గా రాణించాలని ఆకాంక్షించారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ధ్యేయం

మహవీర్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో పాల్గొన్న కళాశాల అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 28: విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే మహవీర్ కళాశాల ధ్యేయమని మహవీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కళాశాలలో మెగా జాబ్ మేళాను నిర్వహించారు. ఇన్‌ఫోసిస్, ఏడీఈ సీసీవో లిమిటెడ్, టెక్ మహేంద్ర, కోజెంట్ ఈ సర్వీస్, అపోలో ఫార్మసీ, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్, వివిధ ఐటీ, ఫార్మసీ కంపెనీలు, బ్యాకింగ్ సంస్థలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహవీర్ కళాశాలతో పాటు వివిధ కళాశాలల విద్యార్థులు మేళాలో పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించేందుకు నిరంతరం కష్టపడాలని సూచించారు. ఇంటర్వ్యూలలో రాణించేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. జాబ్‌మేళాలో పాల్గొన్న విద్యార్థులకు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సంరెడ్డి జయలక్ష్మి, జాయింట్ సెక్రటరీ ధనుంజయ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉషశ్రీ, డాక్టర్ రమాదేవి, ప్రతిభాభారతి, లక్ష్మణ్‌రావు, వివిధ శాఖల హెచ్‌వోడీలు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

జూబ్లీహిల్స్,సెప్టెంబర్28: మానవ సేవే మాధవ సేవగా భావించి వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలోని గుడ్ సిటిజన్స్ కాన్సెప్ట్ స్కూల్‌లో వరద బాధిత కుటుంబాల విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. అంతేకా కుండా రెడ్‌క్రాస్ తరపున వరంగల్, ఖమ్మం, ఏపీలోని విజయవాడ ప్రాంతాల్లో పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ పీఆర్‌ఓ ఎం.సతీశ్‌రెడ్డి, సికింద్రాబాద్ జోనల్ కన్వీనర్ అయూబ్ ఖాన్, ట్రెజరర్ పురుషోత్తం, షేక్‌పేట్ మండల కన్వీనర్ శ్రీనివాస్, సభ్యులతోపాటు గుడ్ సిటిజన్స్ కాన్సెప్ట్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గుడ్ సిటిజన్స్ కాన్సెప్ట్ స్కూల్ టీచర్స్ ప్రవీణ, వరలక్ష్మి, భార్గవిలకు మామిడి భీమ్ రెడ్డి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు. అంతేకాకుండా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులను సన్మానించారు. పలువురు విద్యార్థులకు ప్రత్యేక పురస్కారాలు అందజేశారు.

కుటుంబానికి గ్రాండ్ పేరెంట్సే వెన్నెముక ..

చిన్నారులతో నృత్యం చేస్తున్న అమ్మమ్మలు, నానమ్మలు

జూబ్లీహిల్స్,సెప్టెంబర్ 28 : యూసుఫ్ గూడ శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయి సరస్వతి విద్యానికేతన్‌లో శనివారం గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహించారు. వేడుకల్లో చిన్నారులు చిట్టిపొట్టి మాటలతో తమ అమ్మమ్మలు, నాయనమ్మలు, తాతయ్యలతో ఉన్న అను బంధాన్ని పంచుకున్నారు. బుడిబుడి అడుగులతో వారితో కలిసి నాట్యం చేయడంతో పాటు గ్రాండ్ పేరెంట్స్ అలంకరణతో అలరించారు. పాఠశాల చైర్‌పర్సన్ శిరీష శంకర్ మాట్లాడుతూ.. కుటుంబంలో గ్రాండ్ పేరెంట్స్ వెన్నెముక లాంటివారని.. పిల్లలకు చిన్ననాటి నుంచే తాతయ్య, అమ్మమ్మ, నాయనమ్మ విలువలను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దూరవిద్యా కోర్సుల పరీక్ష తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 28: ఓయూ దూరవిద్యాకేంద్రం (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ మొదటి, మూడో సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలను వచ్చేనెల 5 నుంచి, పీజీడీసీఏ మొదటి, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్ మొదటి సెమిస్టర్ మెయిన్ పరీక్షలను వచ్చే నెల 16 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

'ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం'

హిమాయత్‌నగర్ ఎస్ఎన్‌రెడ్డి భవన్ వద్ద ఏబీ బర్దన్‌కు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

హిమాయత్‌నగర్,సెప్టెంబర్28: కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నరసింహ, వీఎస్ బోస్,నగర కార్యదర్శి ఎస్.ఛాయాదేవి విమర్శించారు. సీపీఐ జాతీయ నేత ఏబీ బర్దన్ శత జయంతిని శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. బర్దన్ ఫ్లెక్సీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల హక్కుల కోసం ఏబీ బర్దన్ రాజీలేని పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించకుండా మతం పేరుతో కేంద్రం రాజకీయాలు చేస్తున్నదని ఆరోపించారు. పార్టీని బలోపేతం చేసి ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు కొనసాగించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు ప్రేంపావని,స్టాలిన్, యాదగిరి, వెంకటేశం, శంకర్‌నాయక్, ధర్మేంద్ర, ఎన్. శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, కిషన్, .వెంకటయ్య, కళ్యాణ్, అనిల్,నాగిరెడ్డి పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 28 : పోషకహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని శంషాబాద్ ఎంపీడీవో మున్ని, మహేశ్వరం సీడీపీవో శాంతిశ్రీ అన్నారు. శనివారం శంషాబాద్ మండలం మల్కారం గ్రామంలో పోషక మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోషక అభియాన్ 2024లో భాగంగా పోషకాహారం,పరిశుభ్రతపై మహిళలు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. పాలు, గుడ్లు, పండ్లు. ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. అనంతనరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. నర్కూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దివ్య తక్కువ బరువు ఉన్న చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ,పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

విదేశీ భాషల డిప్లొమా కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 28: ఓయూ పరిధిలోని విదేశీ భాషల డిప్లొమా కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రెంచ్, జర్మన్ భాషల్లో జూనియర్, సీనియర్ డిప్లొమా కోర్సుల రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 9లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో 16 వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను ఏప్రిల్‌లో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

అర్ధరాత్రి వరకు హోటల్ నడిపిన వ్యక్తికి జైలు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 28 : అర్ధరాత్రి వరకు హోటల్ నిర్వహించిన వ్యక్తికి నాంపల్లి కోర్టు ఒక రోజు జైలు శిక్ష విధించింది. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాలు.. గోల్కొండకు చెందిన మహ్మద్ ముదాసిర్ పాషా (34) అమీర్‌పేటలో హోటల్ నిర్వహిస్తున్నాడు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వరకు హోటల్ నిర్వహించడంతో అతడిపై కేసు నమోదైంది. పోలీసులు నిందితుడిని నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టగా ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

మూసీ పరీవాహక ప్రజలకు అండగా ఉంటాం..

- బీఆర్ఎస్‌వీ ఉపాధ్యక్షుడు అప్పారెడ్డి ముఖేశ్
- నేడు హైదర్షాకోట్‌లో పర్యటించనున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి తదితరులు

అత్తాపూర్ భరత్‌నగర్‌లో మూసీ బాధితులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ నాయకుడు అప్పారెడ్డి ముఖేశ్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 28: పైసా పైసా కూడబెట్టుకొని పేదలు నిర్మించుకున్న ఇండ్లను కాంగ్రెస్ సర్కార్ హైడ్రా పేరుతో కూల్చివేయడం అమానుషమని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అప్పారెడ్డి ముఖేశ్ అన్నారు. అత్తాపూర్ డివిజన్ భరత్‌నగర్‌లోని మూసీ పరీవాహక ప్రాంతంలో శనివారం ఆయన బాధితులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం అప్పారెడ్డి ముఖేశ్ మాట్లాడుతూ అమాయక ప్రజలపై హైడ్రా ప్రతాపం చూపడం సరికాదన్నారు. మూసీ సుందరీకరణ పేరుతో అనేక సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్న పేదల ఇళ్లను కూల్చివేస్తే వారు ఎక్కడికి వెళతారన్నారు. హైడ్రా బాధితులకు మద్దతుగా ఆదివారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్‌కు రాష్ట్ర మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి రానున్నారని వెల్లడించారు. అత్తాపూర్ భరత్‌నగర్ నుంచి బాధితులు పాల్గొని తమ సమస్యలను విన్నవించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయన వెంట అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు గుర్రంపల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా కూల్చివేతలను ఖండిస్తున్నాం..

కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలంతా పోరాటాలకు సిద్ధం కావాలని బీఆర్ఎస్ బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజు పిలుపునిచ్చారు. హైడ్రా కూల్చివేతలతో పేదలను పీడించడాన్ని ఖండిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. హైదర్షాకోట్ మూసీ పరివాహక ప్రాంతాన్ని మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డిలు సందర్శిస్తారన్నారు. ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

బోరబండ బస్ టెర్మినల్‌లో ప్రయాణికుల అగచాట్లు

- తగ్గిన ట్రిప్పుల సంఖ్య
- బస్సుల కోసం పడిగాపులు

బోరబండ బస్ టెర్మినల్‌లో మూతబడ్డ ఏసీ షెల్టర్ వద్ద బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 28: బస్సు ట్రిప్పుల సంఖ్యను తగ్గించంతో ఆర్టీసీ బోరబండ బస్ టెర్మినల్‌లో ప్రయాణికులకు అగచాట్లు తప్పడంలేదు. మూతబడిన ఏసీ బస్ షెల్టర్ ఎదుట గత 8 నెలలుగా వందలాది ప్రయాణికులు బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు. నగరంలోని ప్రధాన బస్ టెర్మినల్స్‌లో బోరబండ కూడా ఒకటి. గ్రేటర్ పరిధిలో ఆర్టీసీకి అధిక ఆదాయాన్ని సమకూర్చే ఈ టెర్మినల్‌కు నగరంలోని వివిధ డిపోలు, ప్రాంతాల నుంచి బీఆర్ఎస్ హయాంలో రోజుకు సుమారు 900పైగా బస్ ట్రిప్పులు కొనసాగేవి. అయితే ఆర్టీసీ వారు గత 8 నెలలుగా సుమారు 250 ట్రిప్పులను తగ్గించారు. దాంతో అధిక సంఖ్యలో ప్రయాణికులు బస్సుల కోసం అధిక సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది.

శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో సుమారు 200 మంది ప్రయాణికులు మూతబడిన ఏసీ బస్‌షెల్టర్ ముందు వేచి ఉండటం కన్పించింది. ఇందులో మహిళా ప్రయాణికులే ఎక్కువగా ఉన్నారు. రెండు నెలల క్రితం అట్టహాసంగా ప్రారంభించిన ఏసీ బస్ షెల్టర్ తలుపులు కేవలం ఒక్కరోజు మాత్రమే తెరిచి ఉండటం గమనార్హం. ఏదేమైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు ట్రిప్పుల సంఖ్యను పెంచి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్య, వైద్యం, ఉపాధి కోసం యువత ఉద్యమించాలి

హిమాయత్‌నగర్ నుంచి ర్యాలీగా వెళ్తున్న ఏఐవైఎఫ్ నేతలు



బాబుల్‌రెడ్డినగర్‌లో భగత్‌సింగ్ జయంతిలో పాల్గొన్న నవయువ యూత్ క్లబ్ సభ్యులు

హిమాయత్‌నగర్,సెప్టెంబర్ 28: భగత్ సింగ్ స్ఫూర్తితో విద్య,వైద్యం,ఉపాధి కోసం యువత ఉద్యమించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా శనివారం హిమాయత్‌నగర్ నుంచి రాంకోఠి వరకు స్ఫూర్తి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిటీష్ పాలకుల నుంచి దేశ విముక్తి కోసం చిరు ప్రాయంలోనే ఉరికొయ్యలను ముద్దాడిన యువ కిశోరం, పోరాట యోధుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు ఆర్.బాలకృష్ణ, నగర కార్యదర్శి ఎన్.శ్రీకాంత్, కార్యనిర్వహక అధ్యక్షుడు షేక్ మహమూద్, నాయకులు అనిల్ కుమార్, కళ్యాణ్, శరత్, శ్రీహరి, భూపతి, కిరణ్, సమీర్, కృతిక్, సమద్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను యువత ఆదర్శంగా తీసుకోవాలి

మైలార్‌దేవ్‌పల్లి : మహనీయుల పోరాటాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని నవయువ యూత్ క్లబ్ ఉపాధ్యక్షుడు రమేశ్ రెడ్డి అన్నారు. బాబుల్‌రెడ్డినగర్ బొడ్రాయి వద్ద భగత్‌సింగ్ జయంతిని సనాతన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా భగత్‌సింగ్ వీరోచిత పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉప్పల్ శ్రీను, మల్లేష్, శేఖర్, ప్రవీణ్, రఘువీర్, శివ, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 4 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించిన ఈవో శ్రీనివాసశర్మ, అర్చకులు

వెంగళరావునగర్, సెప్టెంబర్ 28 :శ్రీనగర్ కాలనిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నవాహ్నిక బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 4 నుంచి 13 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసశర్మ తెలిపారు. శనివారం ఆలయంలో అర్చకులు, వేద పండితులతో కలిసి ఆయన బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. స్వామి వారి బ్రహ్మోత్సవాలు,శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు స్వామి వారికి విశేష సేవలతోపాటు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేయనున్నట్లు తెలిపారు. భక్తులంతా తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఉచిత విద్య



జూబ్లీహిల్స్,సెప్టెంబర్28 : ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో నాణ్యమైన ఉచిత విద్య అందుతుందని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రహ్మత్‌నగర్ డివిజన్ నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించి మౌలిక వసతులపై ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమం లో హెచ్‌ఎం, టీచర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

రహ్మత్‌నగర్ డివిజన్‌లో రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అధికారులను కోరారు. శనివారం యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో ఈఈ రాజ్‌కుమార్‌కు రోడ్ల సమస్యలను వివరించారు. నూతన రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనల ప్రతిని ఈఈ సమక్షంలో అధికారులకు అందజేశారు. ఏఈ భరత్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.